క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు తిరిగి అప్పగింత



సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ

కొండమల్లేపల్లి : ఇటీవల కాలంలో వేర్వేరు సమయాల్లో వేర్వేరు ప్రాంతాల్లో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న ఆరుగురు వ్యక్తులకు ఆదివారం కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రామ్మూర్తి సమక్షంలో తిరిగి వారి ఫోన్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో క్రైమ్ కానిస్టేబుల్ హేము నాయక్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా తిరుపతిరావు

గుర్రంపోడు : బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడిగా వెల్లంపాడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నాగులవంచ తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో తిరుపతిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

దిండి : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఎస్‌ఐ రాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో డీసీసీ(డిండి క్రికెట్ క్లబ్) ఆధ్వర్యంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కలీం, సాయికుమార్, జయవర్ధన్, కాశన్న, శ్రీనివాస్‌గౌడ్, రాములు, వెంకటయ్య, సాయి, సంతోష్, పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన వ్యక్తికి సన్మానం



సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్

చందంపేట : నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ రవీందర్‌నాయక్ ఇటీవల కాకతీయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి గౌరవ డాక్టరేట్ పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, కమిషన్ మెంబర్ నేనావత్ రాంబాబునాయక్ ఆదివారం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ గాజుల ఆంజనేయులు, జగదీశ్ ఉన్నారు.

అనుమతి లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి : మండల పరిధిలోని గడియ గౌరారం, వర్కాల గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ ప్రధాన కార్యదర్శి వందనపు ఆంజనేయులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల పరిధిలో సుమారు 127ఎకరాలలో ఏర్పాటు చేసిన వెంచర్ పూర్తిగా ప్రభుత్వ వ్యతిరేకంగా ఉందన్నారు. ఈ వెంచర్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో మూడు కుంతలతో పాటు, కుంటకు సంబంధించిన 14ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. అదే కాకుండా గడియ గౌరారం గ్రామంలోని చెరువుకు ఈ వెంచర్ ప్రాంతం నుండి వాగు ప్రవహిస్తుందని ఆరోపించారు. సుమారు 200ఎకరాల్లో ఉన్న ఈ చెరువుకు నీరు వచ్చే వీలు లేదన్నారు. ఈ వెంచర్ లోపలి భాగంలో ఉన్న కుంట కట్టలను గతంలో తొలగించారని పేర్కొన్నారు. వెంచర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

తుల్జా భవాని నామస్మరణే..

- దసరా ముందు తొమ్మిది రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షల్లో బావోజీలు
- వంశపారంపర్యంగా వస్తున్న ఆచారం
- 1945 నుంచి కొనసాగుతున్న దీక్షలు



పెద్దమునిగల్‌లోని తుల్జా భవాని అమ్మవారి ఆలయం



పెద్దమునిగల్‌లోని తుల్జా భవాని అమ్మవారి ఆలయంలో బావోజీ కేతావత్ జీవన్ భగత్

చందంపేట : పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం.. తొమ్మిది రోజుల పాటు నియమనిష్టలతో చేసే పండుగ.. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా.. భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న తుల్జా భవాని అమ్మవారి దీక్షలో ఒక్క గిరిజనులే కాదు.. కుల, మతాలకు అతీతంగా ఉంటారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామంలోని తుల్జా భవాని అమ్మవారి ఆలయంలో చేపట్టే కఠిన ఉపవాస దీక్షలపై ప్రత్యేక కథనం.

దసరాకు తొమ్మిది రోజుల ముందు

నేరెడుగొమ్ము మండలంలోని పెద్దమునిగల్ గ్రామంలో కొలువుదీరిన తుల్జా భవాని ఆలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా తుల్జా భవాని అమ్మవారు ఉండడంతో భక్తులు ఇక్కడికి పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. దీంతో 1945లోనే ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. దసరాకు తొమ్మిది రోజుల ముందు ఈ ఉపవాస దీక్షలు బావోజీ(పూజారి) ఆధ్వర్యంలో చేపడుతుంటారు. కఠినమైన నియమనిబంధనలు పాటిస్తూ తొమ్మిది రోజుల పాటు ఈ ఉపవాస దీక్షలు చేపడుతుంటారు. గిరిజనులలో కేతావత్ పాడ (తెగ)కు చెందిన వారు బావోజీలుగా కొనసాగుతూ ఈ ఉపవాస దీక్షలను కొనసాగిస్తూ వస్తున్నారు.

కఠినమైన నిబంధనలతో ఉపవాసం

తొమ్మిది రోజుల పాటు చేపట్టే దీక్షలో బావోజీలు కఠినమైన దీక్షలు పాటిస్తుంటారు. రోజు మొత్తంలో కేవలం రెండు సార్లు మాత్రమే ఆవు పాలను తాగుతూ తుల్జా భవాని అమ్మవారిని కొలుస్తూ ఉపవాసంలో కూర్చుంటారు. ఆలయంలోనే తొమ్మి రోజులు గడుపుతూ అమ్మవారి భజనలో తరిస్తారు. ఆలయంలోనే భక్తులతో కలిసి జాగరణ చేస్తూ భక్తి కీర్తనలు ఆలపిస్తూ అమ్మవారిని కొలుస్తుంటారు. కాలకృత్యాలు తీర్చుకుంటే తప్పనిసరిగా స్నానం ఆచరించి మళ్లీ ఉపవాస దీక్షలో కూర్చుంటారు.

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భక్తులు

పెద్దమునిగల్ తుల్జా భవాని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఒక్క తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, తెనాలి, చీరాల, బాపట్లలతో పాటు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. దసరాకు ఒక రోజు ముందు ఇక్కడ పెద్దమునిగల్ జాతర పేరిట పెద్ద ఎత్తున దర్శించుకుంటుంటారు.

1991 నుంచి దీక్షలో ఉన్నా

తరతరాలుగా వస్తున్న ఆచారం ఇది. తుల్జా భవాని అమ్మవారిని ధ్యానిస్తూ దీక్షలో ఉంటాం. కేవలం రోజులో రెండు సార్లు మాత్రమే ఆవు పాలు మాత్రమే తీసుకుంటాం. పెద్దమునిగల్‌లోని తుల్జా భవాని అమ్మవారి ఆలయంలోనే ఉంటాం. భక్తులతో కలిసి ఆలయంలో నిద్రిస్తాం. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారి దర్శించుకునేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.

– కేతావత్ జీవన్ భగత్, బావోజీ(పూజారి) పెద్దమునిగల్

ప్రతి ఒక్కరిలో దేశభక్తిని నింపిన ఆర్‌ఎస్‌ఎస్



మిర్యాలగూడ : భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

మిర్యాలగూడ టౌన్ : ప్రతి ఒక్కరిలో దేశభక్తిని ఆర్‌ఎస్‌ఎస్(స్వయం సేవక్ సంఘ్) నింపిందని తెలంగాణ ప్రాంత కార్యకారిణి సదస్సులు రాంపల్లి మల్లికార్జున్, నల్లగొండ విభాగ్ సహ సంఘ్ చాలక్ ఇటికాల కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఆర్‌ఎస్‌ఎస్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్‌ఎస్‌పీ క్యాంపులో ఏర్పాటు చేసిన విజయదశమి ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ 1925లో ఏర్పడి ప్రస్తుతం వందో సంవత్సరంలోకి అడుగిడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ పారిశ్రామికవేత్త రేపాల అంతయ్య, చెరుకుపల్లి కరుణాకర్, గూడూరు శ్రీనివాస్‌రావు, అక్కెనపల్లి సుధాకర్, బంటు జనార్ధన్, రాయపూడి జగన్నాధరావు, నక్క నాగరాజు, తళ్లం అశోక్, డాక్టర్ నాగేందర్, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, సత్యప్రసాద్, సరికొండ ప్రీతం రాజు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

డీఏ పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : దసరా కానుకగా డీఏ, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలు ఐదు, పెండింగ్‌లో ఉన్న మెడికల్, వార్షిక ఇంక్రిమెంట్, ఇతర పెండింగ్ బిల్లులను అన్నింటినీ విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులపై చిన్న చూపు చూసిందని, వారికి రావాల్సిన డీఏ, ఇతర బకాయిలు పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వంపై చాలా ఆశలు పెట్టుకోవడం జరిగిందని, దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని బకాయిలు డీఏలు, ఇతర పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు, మూడు రోజుల్లో మంత్రి మండలిలో చర్చించి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో మెతిలాల్, లాలు, మక్తా నాయక్, రమేష్, శ్రీను, వెంకన్న, సైదా, జంమ్లా బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు రాపోలు పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీలోపు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



పెద్దవూరలో మాట్లాడుతున్న నాగార్జున మాదిగ

పెద్దవూర : ఈ నెల 9వ తేదీలోపు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, అప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు ఆడెపు నాగార్జునమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేస్తున్నారన్నారు. ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పిచ్చిందన్నారు. ఈ నెల 9న జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి నిర్వహించే నిరసన ర్యాలీలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి తరి ఏడుకొండల్ మాదిగ, మండల అధ్యక్షుడు మల్లేపల్లి నరేందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏర్పుల వెంకటయ్య, గార్లపాటి ప్రసాద్, ఆడెపు సైదులు, తరి వెంకన్న, ఊర రాంచరణ్, గార్లపాటి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకుంటే ఉద్యమం ఉధృతం



సమావేశంలో మాట్లాడుతున్న సైదానాయక్

మిర్యాలగూడ అర్బన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా.. పేద విద్యార్థులపై చదువులు చదువుకోవాలంటే అవకాశాలు లేకపోవడం బాధాకరమన్నారు.గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ.8వేలు కోట్లు బకాయి ఉండటంతో ప్రస్తుత ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో అరకొర వసతులతో నాణ్యమైన భోజనం అందక పౌష్టికాహార లోపంతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జగన్ నాయక్, మహిళా నాయకురాలు ప్రసన్న, వీరన్న, సంపత్, మునీ, సిపాయినాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వాహనాలు వెళ్లేదెలా!



పైలాన్‌కాలనీలో బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి ఇలా..

నాగార్జునసాగర్ : ప్రపంచ పర్యాటక ప్రాంతమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్దకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వం ఇదే రోడ్డుకు రూ.9కోట్లు మంజూరు చేసింది. పైలాన్ ఫిల్లర్ నుండి మాచర్ల- హైదరాబాద్ రోడ్డును కలిపే వరకు జెన్‌కో కార్యాలయం ముందుగా 60ఫీట్ల రోడ్డు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు రోడ్డు పనులకు టెండర్లు పిలిచి అగ్రిమెంటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపుల యజమానులంతా ఒకరి తర్వాత ఒకరు తమ షాపులు రోడ్డువైండింగ్‌లో పోతున్నాయంటూ కోర్టుకు వెళ్లారు. కోర్టులోని వాజ్యాలన్నింటిని కొట్టి వేయించి పనులు మొదలు పెట్టే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయింది. పనులు నిలిచి పోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంత కొట్టుకుపోయింది. ఒకటి రెండుసార్లు స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఆ గుంతలన్నింటిని మట్టితో పూడ్చారు. సాగర్ కాలనీలు కొండపై ఉండటంతో వర్షం పడినపుడు వర్షపు నీరంతా రోడ్డుమీదనుండే వెళ్తుంది. దీంతో ఆ మట్టి కొట్టుక పోవడంతో గుంతలు తేలాయి. దీంతో పైలాన్ బస్టాండుకు రావాల్సిన బస్సులు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. త్వరలో పాలకులు రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మిర్యాలగూడ టౌన్ : బకల్‌వాడీ పాఠశాలపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మిర్యాలగూడ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బకల్‌వాడీ పాఠశాలలో 2004–2025 సంవత్సరం 10వ తరగతి చదువుకున్న ఏ,బి,సీ,డీ సెక్షన్ల పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తరువాత ఆదివారం ఒకే వేదికపైగా వచ్చారు. పట్టణంలోని తూడి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 250 మంది పూర్వ విద్యార్థులు హాజరై ఆనాటి మదు స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం 20 ఏళ్ల తరువాత ఒకే వేదికపైగా తీసుకవచ్చిన ఆర్గనైజింగ్ మిత్రులకు పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

విద్యానికేతన్ ఉనత్న పాఠశాలలో..

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలోని శ్రీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 1994–95విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకొని ఆహ్లాదంగా గడిపారు. పాఠశాలలో తాము గడిపిన గత స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.మహేశ్వర్‌రెడ్డి, డి.ఇంద్రసేనారెడ్డి, రామకృష్ణారెడ్డి, నిర్మల, ఊర్మిల, చంద్రకళ, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, సోమిరెడ్డి, సైదులు, వెంకటేశ్వర్లు, రజిత, వెంకటేష్, సౌజన్య, నాగేశ్వర్‌రావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



23వ వార్డులో సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ హరిబాబు

మిర్యాలగూడ టౌన్ : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎస్. హరిబాబు కోరారు. శుక్రవారం పట్టణంలోని 23వ వార్డులో అశోక్‌నగర్, వాసవీనగర్ కాలనీ, సంతోష్‌నగర్‌లో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను తహసీల్దార్ హరిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డులో మున్సిపల్ అధికారులు ఆరు బృందాలుగా సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది పేర్లు నమోదు చేసుకోవాలని, లేనివారిని తొలగించనున్నట్లు తెలిపారు. నూతనంగా కుటుంబ సభ్యులను, కొత్త ఓటర్లను చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈ వెంకన్న, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ ఎండీ జాఫర్, జేఏఓ ధనుంజయ తదితరులున్నారు.

కిటకిటలాడిన పశువుల సంత



కొండమల్లేపల్లి సంతకు పోటెత్తిన మేక పోతులు, గొర్రె పొట్టేళ్లు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో నిర్వహించే పశువుల సంత ఆదివారం దసరా నేపథ్యంలో క్రయ విక్రయాలతో కిటకిటలాడింది. దసరా సమీపిస్తుండడంతో వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన క్రయ విక్రయదారులు మేకపోతులు, గొర్రె పోట్టేళ్ల విక్రయాలతో సంత కిటకిటలాడింది. కాగా చందంపేట మండలంలోని పెద్దమునిగల్ ముత్యాలమ్మ జాతర జరగనున్న సందర్భంగా గొర్రె పోటేళ్లకు డిమాండ్ నెలకొంది.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



శైలజ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

వేములపల్లి (మాడుగులపల్లి) : మాడుగులపల్లి మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన దొంతగాని శైలజ ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతిచెందింది. కాగా దశదిన కర్మకు ఆమెతోపాటు ఆగామోత్కూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు హాజరై శైలజ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి రూ.27వేల ఆర్థిక సాయం అందజేసి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పతాని శ్రీను, భూపతి సురేష్, పున్నా రాకేష్, జాల సైదులు, ప్రియాంక, శైలజ, శంకరమ్మ, లలిత, శోభా, రజిత పాల్గొన్నారు.

సాయిదత్తాశ్రమంలో చండీ హోమం

మిర్యాలగూడ టౌన్ : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే కాలనీలోని శ్రీ సాయిదాత్తాశ్రమంలో చండీ హోమంను తిరుమల తిరుపతి దేవాస్థానం వేద పండితులు పీసపాటి లక్ష్మిగణపతి శాస్త్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గామాత



హాలియా : అమ్మవారి వద్ద పూజలు చేస్తున్న భక్తులు



మిర్యాలగూడ : భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దంపతులు



మిర్యాలగూడ : శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో..



చింతపల్లిలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



పెద్దవూర : దుర్గాంబికా దేవాలయంలో అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు



పెద్దవూరలో..

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో అన్యాయం

నల్లగొండ టౌన్: రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల దీపేందర్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటేశ్వర్లు, మహేందర్ పాల్గొన్నారు..

నూతన కమిటీ ఎన్నిక

రామగిరి(నల్లగొండ): పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ది నల్లగొండ మిర్యాలగూడ రోడ్ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పున్న పవన్‌కుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ డానియల్ పాల్గొని అధ్యక్షుడు పున్న పవన్‌కుమార్‌ను సన్మానించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఇబ్రహీం అలీ, సైదిరెడ్డి, నల్లగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, కౌన్సిలర్ ఆనంద్‌కుమార్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణారెడ్డి, ఆచారి, సతీష్, సైదులుగౌడ్, శంకర్, సత్యనారాయణ, ఎండీ. సమీ, అల్తాస్ సైదులు, కంభంపాటి జానయ్య, తండు జానయ్య పాల్గొన్నారు.